# ఘనంగా 'మియాట్' వ్యవస్థాపక దినం



మహేష్ ట్రస్ట్‌కు చెక్ అందజేస్తున్న ఆస్పత్రి నిర్వాహకులు



**ప్యారిస్**: స్థానిక మనపాక్కం మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రి 15వ వ్యవస్థాపక దినం బుధవారం ఘనంగా జరిగింది. సంస్థ ఛైర్మన్ డాక్టర్ పీవీఏ మోహన్‌దాస్, మల్లిక దంపతులు ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో సీషెల్స్ దేశ ఉపాధ్యక్షుడు రోలన్ ద్యాని ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ బాధిత పేద పిల్లలకు ఉచిత చికిత్సలందిస్తున్న మహేష్ ట్రస్ట్‌కు రూ.10 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా రోలన్ ద్యాని మాట్లాడుతూ, మియాట్ ఆస్పత్రి ఉన్నత శ్రేణి వైద్య చికిత్సలు అందించడంలో చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల సుమారు 129 దేశాలకు చెందిన రోగులు ఇక్కడ చికిత్సలు పొంది కోలుకున్నారని తెలిపారు. 46 మంది వైద్యనిపుణులతో, అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో ఈ సంస్థ ముందుకు దూసుకువెళుతోందని తెలిపారు.

సంస్థ అధినేత మోహన్‌దాస్ మాట్లాడుతూ ... తమ సంస్థ వైద్యంతో పాటు సమాజ సేవలో పాల్గొంటోందని, క్యాన్సర్‌తో బాధపడుతున్న పేదలను ఆదుకోవాలన్న దృష్టితో గత సంవత్సరం నిర్వహించిన కేర్‌వాక్ ద్వారా వసూలైన నిధిని క్యాన్సర్ వ్యాధికి ఉచిత చికిత్సలందిస్తున్న మహేష్ ట్రస్ట్‌కు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ కింగ్‌డమ్, యూఏఈ, జర్మనీ, టాంజానియా, జాంబియా, అబుదాబి, సౌత్ సూడాన్ తదితర దేశాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. అలాగే, ప్రముఖ వైద్యులు పృథ్వీ మోహన్‌దాస్, సురేంద్రన్, శ్రీకుమార పిళ్లై, చెలియన్ సుభాష్, బ్యారీ రొసారియో, భాషి , ప్రముఖ సినీ దర్శకుడు రాజీవ్ మీనన్, మహేష్ ట్రస్ట్ నిర్వాహకులు జయేంద్ర, అరుణా సుబ్రమణ్యం తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మియాట్ అందిస్తున్న వైద్య సేవలను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా మైథిలీ ప్రకాష్ ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది.